సాక్షి ములుగు

మంగళవారం । 25 । జూలై । 2023



‘సాగు’ ముమ్మరం

ఇటీవల కురుస్తున్న వర్షాలతో వివిధ పంటల సాగులో చేపట్టాల్సిన సస్యరక్షణ చర్యలను మల్యాల కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు పలు సూచనలు చేశారు. - 8లో▸



కాళోజీ ఖ్యాతిని తెలిపేలా నిర్మాణం

- 8లో▸

కాళోజీ ఖ్యాతిని తెలిపేలా కళాక్షేత్రం నిర్మాణం ఉండాలని ప్రభుత్వ చీఫ్‌విప్ వినయ్‌భాస్కర్, ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్ అన్నారు.

గరిష్టం/కనిష్టం

28.0^0 /25.0^0

వాతావరణం

జిల్లాలో ఆకాశం మేఘావృతమై ఉంటుంది. అల్పపీడన ప్రభావంతో వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

‘తొలిమెట్టు’ను విజయవంతం చేయాలి

ములుగు: విద్యాశాఖ తరపున నిర్వహిస్తున్న తొలిమెట్టు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సమగ్ర శిక్ష క్వాలిటీ కోఆర్డినేటర్ బద్దం సుదర్శన్‌రెడ్డి సూచించారు. జిల్లా కేంద్రంలో సోమవారం మండల రీసోర్స్ పర్సన్లకు నిర్వహించిన మూడు రోజుల శిక్షణ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. గతంలో నిర్వహించిన శిక్షణ కార్యక్రమం విజయవంతమైందన్నారు. ఈ ఏడాది కూడా ప్రత్యేక దృష్టి సారించి విజయవంతం చేయాలన్నారు. ప్రణాళికతో బోధన చేసే విధంగా ప్లాన్ సిద్ధం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్లానింగ్ కోఆర్డినేటర్ రాజు, డీసీఈబీ కార్యదర్శి విజయమ్మ, రిసోర్స్ పర్సన్స్ శ్రీరంగం, షర్మిల, రమేష్, దేవి వరప్రసాద్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులకు టీకాలు వేయాలి



ములుగు: మిషన్ ఇంద్ర ధనుష్ 5.0 కార్యక్రమంలో భాగంగా చిన్నారులకు 100 శాతం టీకాలు తప్పనిసరిగా వేయాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అధికారులను ఆదేశించారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఆరోగ్య ఉపకేంద్రాల ఏఎన్ఎంలు, సిబ్బందికి వచ్చే నెల 7వ తేదీ నుంచి అక్టోబర్ 14 వరకు మూడు దపాలుగా అందించనున్న వ్యాక్సినేషన్ కార్యక్రమంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఐదేళ్ల లోపు చిన్నారులు, గర్భిణులకు టీకాలు వేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి అల్లెం అప్పయ్య, ప్రోగ్రాం ఆఫీసర్ పవన్‌కుమార్, మాస్ మీడియా అధికారి తిరుపతయ్య, హెచ్‌ఈ సంపత్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో ఇమ్యూనైజేషన్ ప్రోగ్రాం ఆఫీసర్ విపిన్ అధ్యక్షతన అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. డాక్టర్ ఫణీంద్రా, యూవిన్ పోర్టల్‌పై వివరించారు. ఈ కార్యక్రమంలో ఎన్‌సీహెచ్ ప్రోగ్రాం అధికారి పవన్‌కుమార్, సీహెచ్‌ఓ దుర్గారావు, పూర్ణ, సంపత్‌రావు, హెల్త్ ఎడ్యుకేటర్ సంపత్, భాస్కర్, ప్రవీణ్‌కుమార్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

దోమతెరల పంపిణీ



వెంకటాపురం(కె): మండల పరిధిలోని బోదాపురం పంచాయతీలోని సీతారాంపురం గ్రామంలో వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో సోమవారం దోమతెరల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా దోమ తెరలను వెంకటాపురం జెడ్పీటీసీ పాయం రమణ, డీఎంహెచ్‌ఓ అల్లెం అప్పయ్య చేతుల మీదుగా గ్రామస్తులకు అందజేశారు. అనంతరం ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన బాబురావు కుటుంబ సభ్యులకు ఏటూరునాగారం ఐటీడీఏ నుంచి మంజూరైన రూ.25 వేల చెక్కును అందజేశారు. ఈ కార్యకరమంలో తహసీల్దార్ అంటి నాగరాజు, రెవెన్యూ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థి దశ కీలకమైంది



ములుగు రూరల్: జీవితంలో విద్యార్థి దశ కీలకమైందని జెడ్పీ చైర్‌పర్సన్ బడే నాగజ్యోతి అన్నారు. గోవిందరావుపేట మండల పరిధిలోని చల్వాయి ప్రభుత్వ జిల్లా పరిషత్ పాఠశాలలో వీరపనేని రామదాసు– వెంకటసుబ్బమ్మ జ్ఞాపకార్థం వారి కుమారుడు దోర్నే అందించిన నోట్‌బుక్స్ పంపిణీ కార్యక్రమం సోమవారం చేపట్టగా ఆమె ముఖ్య అతిథిగా హాజరై పంపిణీ చేశారు. విద్యార్థులకు సేవ చేయడం గొప్ప విషయమన్నారు. అనంతరం హెచ్‌ఎంలు నాగేశ్వర్‌రావు, సమ్మిరెడ్డితో కలిసి పాఠశాలను పరిశీలించారు. సమస్యల పరిష్కారానికి సహకరిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఈసం సమ్మయ్య, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు సాయికుమార్, నాయకులు సురేష్‌నాయక్, ప్రసాద్, ఉపాధ్యాయులు శ్యాంసుందర్‌రెడ్డి, వాసుదేవరెడ్డి, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

వారసత్వ హోదాకు రెండేళ్లు..

రామప్ప దేవాలయం యునెస్కో గుర్తింపు పొందినా అభివృద్ధి నిల్

- దృష్టి సారించని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు
- నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న పురావస్తు శాఖ అధికారులు
- పెరిగిన పర్యాటకుల సంఖ్య
- కానరాని సౌకర్యాలు



యునెస్కో గుర్తింపు పొందిన రామప్ప దేవాలయం



రామప్ప ఆలయంలోని రామలింగేశ్వరస్వామి

వెంకటాపురం(ఎం): ప్రపంచ పటంలో రామప్ప ఆలయానికి అరుదైన గౌరవం దక్కిందని దేశంతో పాటు తెలుగు రాష్ట్రాల ప్రజలు గర్వపడ్డారు. కాకతీయులు నిర్మించిన రామప్ప దేవాలయానికి వారసత్వ హోదా కల్పిస్తున్నట్లుగా వరల్డ్ హెరిటేజ్ కమిటీ ప్రకటించడంతో ప్రజలందరూ సంబురపడ్డారు. రామప్ప ఆలయంతో పాటు పరిసర ప్రాంతాలు అభివృద్ధికి మారుపేరుగా నిలుస్తాయని ప్రజలు ఆశపడ్డారు. కేంద్ర, రాష్ట్ర మంత్రులు సైతం సందర్శించి రామప్ప రూపురేఖలు మార్చివేస్తామని, రామప్ప అభివృద్ధికి ప్రభుత్వం నుంచి నిధులు కేటాయిస్తామని హామీ ఇవ్వడంతో పర్యాటకులకు ఉత్తేజాన్ని కలిగించింది. కాని రామప్పకు యునెస్కో గుర్తింపు వచ్చి నేటికీ రేండేళ్లు పూర్తయినా ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా రామప్ప పరిస్థితి నెలకొంది. రామప్ప ఆలయానికి గుర్తింపు ఇచ్చే నేపథ్యంలో వరల్డ్ హెరిటేజ్ కమిటీ కొన్ని షరతులు విధించింది. రామప్పకు వచ్చే పర్యాటకులకు మౌలిక వసతులు కల్పించడంతో పాటు ఆలయం చుట్టూ 500 మీటర్ల లోపు బఫర్ జోన్‌గా ప్రకటించి ఎలాంటి నిర్మాణాలు, కట్టడాలు చేపట్టకూడదని షరతులు విధించింది. 2022 డిసెంబర్‌లోగా పనులు పూర్తి చేయాల్సిన కేంద్ర, రాష్ట్ర పురావస్తుశాఖలు నిద్రావస్థలో ఉంటూ పనులపై దృష్టి సారించకపోవడంతో రామప్ప ఆలయ అభివృద్ధి ముందుకు సాగలేదు.

ప్రారంభంకాని కామేశ్వరాలయం పనులు

వరల్డ్ హెరిటేజ్ కమిటీ విధించిన ప్రధాన షరతుల్లో ఒకటి కామేశ్వరాలయ పునర్నిర్మాణం. 2022 డిసెంబర్‌లోపే పూర్తి చేస్తామని చెప్పిన పురావస్తుశాఖ ఇప్పటివరకు ప్రారంభించకపోవడం గమనార్హం. దీంతో కామేశ్వరాలయానికి చెందిన శిల్పాలు ఎండకు ఎండుతూ, వానకు తడుస్తున్నాయి. కామేశ్వరాలయ పనులు 2026లోగా చేస్తామని కమిటీని పురావస్తుశాఖ అధికారులు అభ్యర్థించారు.

తూర్పు రోడ్డుకు కలగని మోక్షం..

రామప్ప ఆలయాన్ని దర్శించుకునేందుకు వాస్తుపరంగా తూర్పుముఖ ద్వారాన్ని (రోడ్డు) 90 లక్షల నిధులు వెచ్చించి నిర్మించారు. రెండు వరుసల రోడ్డును (డబుల్ రోడ్) నిర్మించి, సెంట్రల్ లైటింగ్ కూడా ఏర్పాటు చేశారు. పూర్తయిన మూడు నెలలకే భారీవర్షాల కారణంగా రామప్ప సరస్సు మత్తడి నుంచి వచ్చే వరదనీటికి తూర్పు రోడ్డు కొట్టుకపోయింది. వరద నీరు వెళ్లేందుకు వేసిన పైపులు సైతం ధ్వంసమయ్యాయి. దీనితో 380 మీటర్లు ఉన్న తూర్పు రోడ్డును నాలుగు వరుసల రోడ్డుగా విస్తరించి, మత్తడి నీరు వెళ్లే విధంగా బ్రిడ్జి నిర్మించాలని రూ.3కోట్ల నిధులను ప్రభుత్వం మంజూరు చేసింది. నిధులు మంజూరై ఏడాది కావస్తున్నప్పటికీ పనులు మాత్రం ప్రారంభం కాలేదు.

నత్తనడకన ప్రశాద్ ప్రాజెక్టు పనులు

రామప్ప దేవాలయానికి వచ్చే దేశ, విదేశీ పర్యాటకులకు వసతులు కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రశాద్ ప్రాజెక్టు కింద రూ.62 కోట్ల నిధులను కేటాయించింది. మొదటి విడుతగా రూ.42 కోట్ల నిధులను మంజూరు చేసి గత ఏప్రిల్ మాసంలో పనులను ప్రారంభించింది. మూడు నెలలు కావస్తున్నప్పటికీ పనులు పునాది దశలోనే ఉన్నాయి. ప్రస్తుతం వర్షాకాలం కావడంతో మరో మూడు నెలల పాటు పనులు కొనసాగే పరిస్థితులు కనిపించడం లేదు. అలాగే రోజురోజుకూ పర్యాటకుల సంఖ్య విపరీతంగా పెరుగుతోంది.

అభివృద్ధిపై నిరాశే..

రామప్ప ఆలయం అభివృద్ధి చెందుతుందని కలలు కన్న ప్రజలకు, పర్యాటకులకు నిరాశే మిగిలింది. యునెస్కో గుర్తింపు పొందిన నేపథ్యంలో రామప్ప ఆలయ అభివృద్ధికి కేంద్రం రూ.200 కోట్లు, రాష్ట్ర ప్రభుత్వం 100 కోట్లు నిధులు ఇస్తుందని స్థానికంగా బాగానే ప్రచారం జరిగింది. ఈ ప్రచారం ద్వారా స్థానికంగా ఉన్న భూముల రేట్లు మూడింతలు పెరిగినప్పటికీ రామప్పలో అభివృద్ధి మాత్రం కాన రాలేదు. రాష్ట్ర ప్రభుత్వం కామేశ్వరాలయ పునర్నిర్మాణం కోసం రూ.12 కోట్లు, ఉప ఆలయాల అభివృద్ధికి రూ.15 కోట్లు మంజూరు చేసినా పనులను పూర్తి చేయించడంలో పురావస్తు శాఖ అధికారులు విఫలమయ్యారు. రామప్ప ఆలయం ఎదుట ఉన్న ఒక్క గొల్లాల గుడిని మాత్రమే అభివృద్ధి చేసినప్పటికీ వినియోగంలోకి తీసుకురాలేదు.

పేరు గొప్ప ఊరు దిబ్బ



పేరు గొప్ప ఊరు దిబ్బ అన్న చందంగా రామప్ప పరిస్థితి నెలకొంది. రామప్ప ఆలయానికి యునెస్కో గుర్తింపు వచ్చి రెండేళ్లు అయినా కేంద్ర ప్రభుత్వం నిధులు కేటాయించలేదు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ముతో పాటు కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి రామప్ప ఆలయాన్ని సందర్శించిన రామప్ప అభివృద్ధికి చొరవ తీసుకోకపోవడం విడ్డూరంగా ఉంది. రామప్ప ఆలయాన్ని సందర్శించే పర్యాటకులకు మౌలిక వసతులు లేకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రామప్ప ఆలయానికి ఆర్టీసీ బస్సుల సౌకర్యం కల్పించాలి. పర్యాటకుల సౌకర్యార్థం రామప్ప దర్శన సమయాన్ని రాత్రి 9గంటల వరకు పెంచాలి.

- దోలి రజిత, పాలంపేట సర్పంచ్

యునెస్కో పేరుతో దుకాణాలు తొలగించారు



రామప్ప ఆలయానికి యునెస్కో గుర్తింపు వచ్చిందని ఆలయం ఎదుట ఉన్న 28 మందికి చెందిన చిరు దుకాణాలను తొలగించారు. రామప్ప తూర్పురోడ్డుకు శాశ్వత దుకాణాలు ఏర్పాటు చేసేందుకు స్థలాన్ని కేటాయించి కాంప్లెక్స్‌లను నిర్మిస్తామని చెప్పిన అధికారులు రెండేళ్లు కావస్తున్నా స్థలాన్ని కేటాయించలేదు. తాత్కాలికంగా రామప్ప ఆలయం ఎదుట దుకాణాలు ఏర్పాటు చేసుకునేందుకు కూడా అధికారులు అనుమతి ఇవ్వడం లేదు. ఒకవైపు కరోనా కారణంగా, మరోవైపు దుకాణాలను తొలగించడంతో తీవ్ర ఇబ్బందులు పడుతూ కుటుంబపోషణ భారంగా మారింది.

- రాపర్తి రాజు, చిరు వ్యాపారి రామప్ప

ప్రజావాణి వినతులు త్వరగా పరిష్కరించాలి



దరఖాస్తు పరిశీలిస్తున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి



వినతి పత్రం స్వీకరిస్తున్న పీఓ అంకిత్

కలెక్టర్ ఇలా త్రిపాఠి

ములుగు: ప్రజావాణిలో స్వీకరించే వినతులను త్వరితగతిన పరిష్కరించాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అధికారులను ఆదేశించారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా ఆయా మండలాల నుంచి వచ్చిన 78 మంది నుంచి దరఖాస్తులను కలెక్టర్ స్వీకరించారు. ఇందులో రెవెన్యూశాఖకు 30, పెన్షన్లు కేటాయించాలని 14, డబుల్ బెడ్ రూం ఇళ్లు కేటాయించాలని 15, ఇతర సమస్యలపై 19 దరఖాస్తులు వచ్చాయి. మొత్తంగా వచ్చిన 78 దరఖాస్తులను ఆయా శాఖల అధికారులకు సిఫారసు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వరుసగా కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో అధికారులు ప్రజలకు అండగా ఉండి విధులు నిర్వహించాలన్నారు. మరో మూడు రోజుల పాటు వర్షాలు ఉన్నట్లుగా వాతావరణశాఖ ప్రకటించడంతో అధికారులను అప్రమత్తం చేశారు. మండలాల ప్రత్యేక అధికారులు సమస్యాత్మకంగా ఉన్న ప్రాంతాల్లో పర్యటించి ఎలాంటి ఆటంకాలు జరుగకుండా చూసుకోవాలన్నారు. గ్రామాల్లో పిచ్చి మొక్కలు, చెత్తాచెదారం లేకుండా తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వైవీ.గణేశ్, ఆర్డీఓ సత్యపాల్‌రెడ్డి, జెడ్పీ సీఈఓ ప్రసూన రాణి, ఏటీడీఓ దేశిరాం, పశు సంవర్ధకశాఖ అధికారి విజయభాస్కర్, డీఆర్‌డీఓ నాగపద్మజా, సీపీఓ ప్రకాశ్, జిల్లా వ్యవసాయ అధికారి గౌస్ హైదర్, బీసీ వెల్ఫేర్ అధికారి లక్ష్మణ్, ఎస్సీ కార్పొరేషన్ ఈడి తుల రవి, సివిల్ సప్లైజిల్లా మేనేజర్ రాములు, అరవింద్‌రెడ్డి, నాగేశ్వర్‌రావు, తిరుపతి, వెంకటరమణాచారి, సుచరిత, రాజ్‌కుమార్, సర్దార్‌సింగ్, కుమారస్వామి ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

గిరిజన దర్బార్‌లో 41 దరఖాస్తులు

ఏటూరునాగారం: మండల కేంద్రంలోని ఐటీడీఏ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన గిరిజన దర్బార్‌లో 41 దరఖాస్తులను ఐటీడీఏ పీఓ అంకిత్ స్వీకరించారు. గిరిజన గ్రామాల్లో ఎదుర్కొంటున్న సమస్యలను సత్వరమే పరిష్కరించాలని, వారిని తరుచూ తిప్పించుకోవద్దని పీఓ అధికారులను ఆదేశించారు. మంగపేట మండలం చుంచుపల్లికి చెందిన బొల్లెం నందిని చుంచుపల్లి సేల్స్‌మెన్ ఆర్డర్ కాపీ ఇప్పించాలని వేడుకున్నారు. ములుగు మండలం పత్తిపల్లికి చెందిన సునీల్‌రాజ్ ఆశ్రమ పాఠశాలలో బోధించేందుకు అవకాశం ఇప్పించాలని విన్నవించారు. కన్నాయిగూడెం మండలం చిట్యాల గ్రామానికి చెందిన యాలం అమర్‌నాథ్, బంధం సుశాంత్ ఇంచెర్ల గురుకుల పాఠశాలలో 5వ తరగతి అడ్మిషన్ కావాలని కోరారు. భూపాలపల్లి జిల్లా గుర్రంపేటకు చెందిన గోపిసింగ్ ఏకలవ్య గురుకుల పాఠశాలలో నాన్‌టీచింగ్ ఉద్యోగం ఇప్పించాలని వేడుకున్నారు. వెంకటాపురం(ఎం) మల్లయ్యపల్లికి చెందిన దశరథం ఏకలవ్య పాఠశాలలో ఉద్యోగం ఇప్పించాలని విన్నవించారు. ఇలా తదితర సమస్యలపై గిరిజనులు ఇచ్చిన వినతులను పీఓ పరిశీలించి ఆయా సెక్టార్ అధికారులకు బదిలీ చేసి వాటిని వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఏపీఓ వసంతరావు, జిల్లా, మండల అధికారులు పాల్గొన్నారు.

కేటీఆర్ జన్మదిన వేడుకలు



కేక్ కట్ చేస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ నాగజ్యోతి తదితరులు

ములుగు: రాష్ట్ర బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కేటీఆర్ జన్మదిన వేడుకలను జిల్లా కేంద్రంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. జెడ్పీ చైర్‌పర్సన్ బడే నాగజ్యోతి ఈ వేడుకలకు హాజరై కేక్ కట్ చేశారు. అనంతరం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో హరితహారం కార్యక్రమంలో పాల్గొని మొక్కలు నాటారు. జెడ్పీ కార్యాలయంలో 16 మంది లబ్ధిదారులకు రూ. 6.87లక్షల సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సకినాల భవాని, వెంకటాపురం జెడ్పీటీసీ రుద్రమాదేవి, ములుగు, వెంకటాపురం మండలాల అధ్యక్షులు ప్రవీణ్‌కుమార్, లింగాల రమణారెడ్డి, ఆత్మ చైర్మన్ చక్రపాణి తదితరులు పాల్గొన్నారు.

ఆంతర్యమేంటో..!

పోలీస్‌శాఖలో బదిలీలపై ప్రజల్లో చర్చ



ములుగు: జిల్లాలోని పోలీస్ శాఖలో బదిలీల పర్వంపై జిల్లా వాసుల్లో తీవ్రమైన చర్చ సాగుతోంది. ములుగు డీఎస్పీ, ఎస్సైలుగా విధులు నిర్వర్తించిన పోలీస్ అధికారులను బదిలీ చేయడం వెనుక ఆంతర్యం ఏమిటోనని ములుగు సబ్ డివిజన్ ప్రజలు చర్చించుకుంటున్నారు. ములుగు డీఎస్పీగా ఏప్రిల్ 24న రవీందర్ నియమితులయ్యారు. ఆకస్మాత్తుగా ఈ నెల 22న ట్రాన్స్‌ఫర్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఆయన స్థానంలో కాపుగాని శ్రీనివాస్‌రావును డీఎస్పీగా నియమించారు. 23వ తేదీన తిరిగి రవీందర్‌కు ములుగు డీఎస్పీగా పోస్టింగ్ ఇస్తూ డీజీపీ ఉత్వర్వులు జారీ చేశారు. రెండు రోజుల సమయంలోనే ఒక అధికారి తిరిగి పోస్టింగ్ తీసుకుకోవడం గమనార్హం. ఇదిలా ఉండగా ములుగు ఎస్సైగా పని చేసిన ఓంకార్ యాదవ్‌ను రాజకీయ కారణాలతో మార్చి 22వ తేదీన ఎస్పీ ఎస్సైగా బదిలీ చేశారు. ఆయన స్థానంలో ప్రొహిబేషనరీ ఎస్సైగా పని చేసిన పవన్ కుమార్‌ను ములుగు ఎస్సైగా నియమించారు. నాలుగు నెలలు గడవక ముందే అనివార్య కారణాలతో జూన్ 20న ఎస్పీకి అటాచ్ చేశారు. బదిలీల్లో భాగంగా ఈ నెల 18న భూపాలపల్లి జిల్లా వీఆర్‌కు బదిలీ చేశారు.

అధికారుల తీరుపై నజర్

పోలీసు అధికారుల తీరుపై ఎస్పీ గాష్‌ఆలం ప్రత్యేక దృష్టి సారించి కఠినంగా వ్యవహరిస్తున్నారు. జిల్లా కేంద్రంలోని హెడ్ క్వార్టర్స్, ఎస్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఫిర్యాదుల పెట్టెలో జిల్లాలోని ఆయా మండలాల ప్రజలు తమ సమస్యలను రాతపూర్వకంగా రాసి ఫిర్యాదు చేయడంపై సీరియస్‌గా పరిగణిస్తున్నారు.ఈ క్రమంలోనే డీఎస్పీ, ఎస్సైల బదిలీలు జరుగుతున్నట్లు తెలుస్తోంది. ఇతర ఎస్సైల బదిలీలు మాత్రం ఎన్నికల ప్రక్రియలో భాగంగానే జరుగుతున్నట్లు సమాచారం.

జీఓ 60 ప్రకారం వేతనాలు అందించాలి



మల్లంపల్లిలో రోడ్డు ఊడ్చి కార్మికులకు మద్దతు తెలుపుతున్న ఎమ్మెల్యే సీతక్క

రోడ్లు ఊడ్చి నిరసన తెలిపిన ఎమ్మెల్యే

ములుగు రూరల్: గ్రామ పంచాయతీ కార్మికులకు జీఓ నంబర్ 60 ప్రకారం వేతనాలు అందించాలని ఎమ్మెల్యే సీతక్క ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల పరిధిలోని మల్లంపల్లిలో కార్మికులతో కలిసి సోమవారం రోడ్లు ఊడ్చి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీతక్క మాట్లాడుతూ 19 రోజులుగా పంచాయతీ కార్మికులు నిరసనలు చేపడుతుంటే ప్రభుత్వం పట్టించుకోకపోవడం బాధాకరమన్నారు. మల్టీ పర్పస్ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. పంచాయతీల్లో దళిత గిరిజనులు అధిక సంఖ్యలో విధులు నిర్వహిస్తున్నారని వారికి ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. అర్హులైన కారోబార్‌లను సహాయ పంచాయతీ కార్యదర్శులుగా తీసుకోవాలని కోరారు. జీఓ ప్రకారం కార్మికులకు రూ.15,600 చెల్లించాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు గొల్లపల్లి రాజేందర్‌గౌడ్, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు బానోత్ రవిచందర్, మత్స్య కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి గోల్కొండ రవి, మండల అధ్యక్షుడు చాంద్‌పాషా తదితరులు పాల్గొన్నారు.

వ్యాధుల నివారణకు చర్యలు చేపట్టాలి

ఐటీడీఏ పీఓ అంకిత్



సమావేశంలో మాట్లాడుతున్న పీఓ అంకిత్

ఏటూరునాగారం: కొద్ది రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు లోతట్టు ప్రాంతాలను వరద ముంచెత్తడంతో ఆరోగ్య సమస్యలు తలెత్తకుండా చర్యలు చేపట్టాలని డీఎంహెచ్‌ఓ అప్పయ్యను ఐటీడీఏ పీఓ అంకిత్ ఆదేశించారు. ఐటీడీఏ యూనిట్ అధికారులు, మండల స్థాయి అధికారులతో సోమవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పీఓ మాట్లాడుతూ వర్షపు నీరు నిల్వ ఉన్న ప్రాంతాల్లో ఆరోగ్య సమస్యలు తలెత్తకుండా అన్ని ఆవాసాల్లో వైద్య శిబిరాలు నిర్వహించడంపై దృష్టి సారించాలని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ క్రాంతిని ఆదేశించారు. అన్ని ఆవాసాల్లో పారిశుద్ధ్య ఏర్పాట్లు చేపట్టాలన్నారు. భారీ వర్షాల ప్రభావంపై మరింత దృష్టి పెట్టాలని ఎంపీడీఓలను ఆదేశించారు. గిరిజన వ్యవహారాల మంత్రిత్వ శాఖ ద్వారా ఆర్టికల్ 275(ఐ) ప్రకారం కొత్త బైక్ అంబులెన్స్‌లు మంజూరైనట్లు తెలిపారు. బైక్ అంబులెన్స్‌లు అవసరమైన ప్రదేశాలు, పీహెచ్‌సీలను గుర్తించి ప్రతిపాదనలను వెంటనే సమర్పించాలని డిప్యూటీ డీఎంహెచ్‌ఓను ఆదేశించారు. పీహెచ్‌సీల్లో బర్త్ వెయిటింగ్ హాల్స్ నిర్మాణ స్థితిగతులపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. భవనాలను పూర్తి చేసేందుకు సంబంధిత ఇంజినీర్లతో సమన్వయం చేసుకోవాలన్నారు. గురుకుల విద్యార్థుల హాజరుశాతం, జీసీసీ సామగ్రి తదితర అంశాలపై ప్రిన్సిపాల్‌ను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం డైట్ ఛార్జీలు పెంచిందని, కొత్త డైట్ ఛార్జీల ప్రకారం మెనూలో మార్పులు చేయాలన్నారు. ఏటూరునాగారం, కాటారం, జాకారంలోని 3 యువజన శిక్షణ కేంద్రాల్లో సాంకేతిక కోర్సులను నిరుద్యోగ తెగలను సమీకరించుకొని ప్రారంభించాలన్నారు. జిల్లా స్థాయి కమిటీ సమావేశాన్ని నిర్వహించేందుకు అధికారులతో సమన్వయం చేసుకుంటూ ప్రతి పాదనలు ఏకీకృతం చేయాలని డిటీని ఆదేశించారు.

ఆర్థిక పథకాల అమలుపై దృష్టి

2021–22 సంవత్సరానికి సంబంధించిన ఆర్థిక సహాయ పథకాల లక్ష్యాల అమలుపై దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న ప్రతిపాదనల కోసం వెంటనే ఎంపీడీఓ లాగిన్ నుంచి ఐటీడీఏ లాగికు పంపాలని ఆదేశించారు. ఫిర్యాదుల పరిష్కార స్థితిపై సమీక్షించి, వెంటనే పరిష్కరించాలని మండల స్థాయి అధికారులకు సూచించారు.

నేడు, రేపు భారీ వర్షాలు

హన్మకొండ : ఉపరితల ఆవర్తనం మూలంగా ఈనెల 25, 26 తేదీల్లో హనుమకొండ, వరంగల్, మహబూబాబాద్ జిల్లాల్లో అక్కడక్కడా భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణ శాఖ తెలిపింది. అలాగే ములుగు, జనగామ, జేఎస్ భూపాలపల్లి జిల్లాల్లోనూ భారీ వర్షాలు కురిసే అవకాశముందని పేర్కొంది. గంటకు 40 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో ఈదురు గాలులు వీచే అవకాశముందని, అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు.

‘డబుల్’ ఇళ్ల పేరుతో దగా చేస్తున్న సీఎం



మాట్లాడుతున్న విజయరామారావు

ములుగు రూరల్: నిరుపేదలకు డబుల్ బెడ్ రూం ఇళ్లు అందిస్తామని, నిరుపేదల సొంతింటి కలను నెరవేరుస్తామని సీఎం కేసీఆర్ ప్రభుత్వం దగా చేస్తుందని మాజీ మంత్రి గుండె విజయరామారావు విమర్శించారు. జిల్లా కేంద్రంలో సోమవారం బీజేపీ జిల్లా అధ్యక్షుడు చింతలపూడి భాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో అర్హులందరికీ డబుల్ బెడ్ రూం ఇళ్లను అందించాలని డిమాండ్ చేస్తూ నిర్వహించిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పేదలకు ఆశలు చూపి నేడు హామీలను తుంగలో తొక్కిన ఘనత సీఎం కేసీఆర్‌కు దక్కుతుందన్నారు. అబద్దాల పునాదిపై ప్రభుత్వాన్ని నడిపిస్తున్న బీఆర్‌ఎస్ పార్టీకి రాష్ట్ర ప్రజలు తగిన బుద్ధి చెప్పడం ఖాయమని జోస్యం చెప్పారు. 2016లో కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి రూ.2.91 లక్షల ఇళ్ల నిర్మాణాలకు రూ. 1311.49కోట్ల నిధులను ఇచ్చిందని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం 20 వేల ఇళ్లను కూడా ఇవ్వకపోవడం సిగ్గుచేటన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు అజ్మీర కృష్ణవేణి నాయక్, పార్లమెంట్ కోకన్వీనర్ తక్కళ్లపల్లి దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.

దోషులను కఠినంగా శిక్షించాలి



సమావేశంలో మాట్లాడుతున్న శ్రావణ్

ఏటూరునాగారం: మణిపూర్‌లో మహిళలపై అనుచితంగా ప్రవర్తించి.. హత్య చేసిన దోషులను కఠినంగా శిక్షించాలని తుడుందెబ్బ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కబ్బాక శ్రావణ్ కుమార్ డిమాండ్ చేశారు. ఐటీడీఏ అవరణలో సోమవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. మణిపూర్ రాష్ట్రంలో మైతి, కుకీ తెగలకు మధ్య సాగుతున్న మారణ హోమాన్ని అక్కడి రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణమన్నారు. ప్రభుత్వ నిర్లక్ష్యంతోనే ఇలాంటి సంఘటనలు జరుగుతున్నాయన్నారు. మణిపూర్ రాష్ట్ర ప్రభుత్వాన్ని వెంటనే రద్దు చేసి రాష్ట్రపతి పాలన విధించాలన్నారు. కేంద్ర ప్రభుత్వం, రాష్ట్రపతి జోక్యం చేసుకొని సమస్యను పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో తుడుందెబ్బ జిల్లా కార్యదర్శి సమ్మయ్య, మండల నాయకులు వంక నరేష్ పాల్గొన్నారు.

కాల్వలో బోల్తాపడిన స్కూల్ బస్సు

- పలువురు విద్యార్థులకు స్వల్పగాయాలు
- సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయడమే కారణం



కాలువలో బోల్తాపడిన స్కూల్ బస్సు




గాయాలపాలైన విద్యార్థులు

కేసముద్రం: పాఠశాల నుంచి పిల్లలను ఇంటికి తీసుకెళ్తున్న ఓ ప్రైవేట్ స్కూల్ బస్సు మాదవశాత్తు రోడ్డు వెంట ఉన్న కాల్వలో బోల్తాపడిన సంఘటన మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండల కేంద్రంలో చోటుచేసుకుంది. ఎస్సై తిరుపతి, స్థానికుల కథనం ప్రకారం.. కేసముద్రంస్టేషన్‌లోని ఓ ప్రైవేట్ స్కూల్‌లో చదువుతున్న 22 మంది విద్యార్థులను సోమవారం సాయంత్రం బస్సులో ఇంటికి తీసుకెళ్తున్నారు. బైపాస్ రోడ్డు మూలమలుపు సమీపానికి వచ్చిన సమయంలో.. డ్రైవర్ శ్రీకాంత్ సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేస్తుండడంతో బస్సు అదుపుతప్పి రోడ్డు పక్కనున్న కాల్వలో బోల్తా కొట్టింది. దీంతో బస్సులో ఉన్న పిల్లలంతా గట్టిగా అరుస్తూ కేకలు పెట్టారు. వెనకాల ఉన్న అద్దాన్ని డ్రైవర్ కాలుతో తన్నడంతో ఊడిపోగా.. బస్సులోని కొంత మంది పిల్లలను అతడు బయటకు తీశాడు. తర్వాత జనం గూమికూడుతున్న క్రమంలో డ్రైవర్ పరారయ్యాడు. స్థానికులు మిగతా పిల్లలను బస్సులో నుంచి సురక్షితంగా బయటకు తీశారు. ఈ ఘటనలో బేరువాడకు చెందిన వర్షిత్, బోడమంచ్యాతండాకు చెందిన బోడ మణికంఠ, సిద్దూ, ఆనంద్, చందన, ధరణితోపాటు పలువురు విద్యార్థులకు కంటి వద్ద, చేతులకు, వీపుభాగంలో గాయాలయ్యాయి. వారిని స్థానిక ఆస్పత్రికి తరలించారు. అయితే కాలవ్లో విపరీతంగా చెట్లతీగలు అల్లుకుపోవడం వల్ల బస్సు నెమ్మదిగా ఒరిగి కాలువకు మరోవైపు రాతిగోడకు తాకి పడటంతో పిల్లలకు పెద్దప్రమాదం తప్పినట్లు స్థానికులు చెబుతున్నారు. సంఘటన స్థలాన్ని ఎస్సై తిరుపతి, తహసీల్దార్ సాంబశివుడు చేరుకుని పరిశీలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు. కాగా ఇదే బైపాస్ రోడ్డులో కొద్దినెలల క్రితం రోడ్డు వెంట ఉన్న వ్యవసాయబావిలో కారుపడి నలుగురు మృతిచెందిన విషయం తెలిసిందే. కాగా జరిగిన ఘటన పట్ల పాఠశాల యాజమాన్యం బాధ్యత వహించాలంటూ, డ్రైవర్‌పై చర్యలు తీసుకోవాలని యూత్‌కాంగ్రెస్, ఎన్ఎస్‌యుఐ నాయకులు ఆ పాఠశాల వద్దకు చేరుకుని డిమాండ్ చేశారు.

'సాగు'ముమ్మరం..




మానుకోట మండలంలో సాగులో ఉన్న పత్తి, మొక్కజొన్న చేన్లు

విస్తారంగా కురుస్తున్న వర్షాలు

- వ్యవసాయ పనుల్లో అన్నదాతలు నిమగ్నం
- పంటల్లో చేపట్టాల్సిన చర్యలపై శాస్త్రవేత్తల సూచనలు

మహబూబాబాద్ రూరల్ : ఖరీఫ్ సీజన్ ప్రారంభమైంది. వర్షాలు కొంత ఆలస్యమైనా ప్రస్తుతం విస్తారంగా కురుస్తున్నాయి. ఫలితంగా చెరువులు, వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి. దీంతో అన్నదాతలు సాగు పనుల్లో నిమగ్నమవుతున్నారు. ఈ నేపథ్యంలో వివిధ పంటల సాగులో చేపట్టాల్సిన సస్యరక్షణ చర్యల గురించి మహబూబాబాద్ మండలంలోని మల్యాల కృషి విజ్ఞాన కేంద్రం కోఆర్డినేటర్ డాక్టర్ ఎస్.మాలతి, శాస్త్రవేత్త ఎన్.కిషోర్‌కుమార్.. రైతులకు సూచనలు తెలిపారు.

పత్తి..

- సాధ్యమైనంత మేరకు పొలంలో నీరు నిలవ్వకుండా చూడాలి.
- నీరు నిల్వ ఉంటే కాలువలు ఏర్పాటుచేసి బయటకు పంపించాలి.
- వర్షాలు తగ్గిన తరువాత అదును చూసుకుని వీలైనంత త్వరగా అంతరకృషి (పాటు) చేయాలి
- దీని వల్ల భూమిలో తేమ తగ్గడం, వేర్లకు గాలి, పోషకాలు అందడంతో మొక్కలు త్వరగా సాధారణ స్థితికి వస్తాయి.
- భూమిలో తేమ అధికంగా ఉన్నప్పుడు వేర్లు పోషకాలు, నీటిని తీసుకోలేక ఆకులు లేత ఆకుపచ్చ రంగులోకి మారుతాయి.
- దీనివల్ల పెరుగుదల తగ్గుతుంది. ఈ నేపథ్యంలో పైరుపై 10 గ్రాముల పొటాషియం నైట్రేట్‌ను లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయాలి.
- భూమిలో అధిక తేమ ఉన్నప్పుడు వేరుకుళ్లు తెగులు ఆశించి మొక్కలు చనిపోతాయి.
- దీని నివారణకుగాను కాపర్‌ఆక్సీక్లోరైడ్ 3 గ్రాములు లేదా కార్బండిజం 2 గ్రాములను లీటర్ నీటిలో కలిపి ద్రావణాన్ని తెగులు సోకిన మొక్క మొదళ్లలో పోయాలి.

మిరప..

- ప్రస్తుతం మిరప నారుమడి దశలో ఉంది.
- ఈ వర్షాల వల్ల నారుమడిలో నారుకుళ్లు తెగులు ఆశించే అవకాశం ఉంది.
- దీని నివారణకుగాను మూడు గ్రాముల కాపర్ ఆక్సీక్లోరైడ్‌ను లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయాలి.
- విత్తనం ఒత్తుగా విత్తొద్దు. నారుకుళ్లు కనిపించిన వెంటనే తడులను ఆపాలి.

ఆరుతడి పంటలు..

- మిగతా ఏ పంటలలోనైనా నీరు నిలువ ఉండకుండా ఎప్పటికప్పుడు వెళ్లిపోయేలా చూడాలి.
- వర్షాలు తగ్గిన తరువాత, అదునుచూసి అంతరకృషి చేయాలి.
- వేరుకుళ్లులాంటి తెగులు ఆశిస్తే వెంటనే సస్యరక్షణ చర్యలు చేపట్టాలి.

వరినాట్లు..

- వరి ప్రస్తుతం నారుమడి దశలో ఉంది.
- నారు తీయడానికి ఏడురోజుల ముందు సెంట్ నారుమడికి 160 గ్రాముల కార్బోఫ్యూరాన్ గుళికలు ఇసుకలో కలిపి పలుచగా నీరుంచి వేయాలి.
- దీనివల్ల ప్రధాన పొలంలో వచ్చే ఉల్లికోడు ఉధృతిని, కాండం తొలుచు పురుగు ఉధృతి అరికట్టొచ్చు.
- నారు తీసేటప్పుడు మొక్కలు లేత ఆకుపచ్చగా ఉంటే మునా త్వరగా తిరుగుతుంది.
- నాలుగు నుంచి ఆరు ఆకులు ఉన్న నారును ఉపయోగించుకోవాలి.
- నాటిన తరువాత ప్రతి రెండు మీటర్లకు 20 సెంటీమీటర్ల బాటలు తీయడం వల్ల పైరుకు గాలి వెలుతురు బాగా సోకి చీడపీడల ఉధృతి కొంత వరకు అదుపుచేయొచ్చు.
- ఈ గాలిబాటలు ఎరువులు చల్లడానికి, సస్యరక్షణ మందులు పిచికారీ చేసేటప్పుడు వెసులుబాటుగా ఉంటాయి.
- మొత్తం భాస్వరం ఎరువు దమ్ములోనే వేయాలి.
- పొటాష్ ఎరువులను రేగడి నేలల్లో ఆఖరి దమ్ములో పూర్తిగా ఒకేసారి వేయాలి.
- తేలిక భూముల్లో ఆఖరి దమ్ములో సగం అంకురం ఏర్పడే దశలో సగం వేయాలి.
- ఆఖరి దమ్ములో 20 కిలోల జింకు సల్ఫేట్ వేయాలి.
- రైతులు నారు పోసుకోవాలంటే స్వల్పకాలిక రకాలను వేసుకోవచ్చు.లేదా దమ్ము చేసిన పొలంలో వరిని నేరుగా విత్తే పద్ధతి ద్వారా, వెదజల్లే పద్ధతి లేదా డ్రమ్‌సీడర్ ద్వారా వేసుకోవాలి.
- ఈ పద్ధతిలో కాండం ధృడంగా ఉండే రకాలు ఎన్నుకుంటే బాగుంటుంది.

కేయూలో ప్రొఫెసర్ క్వార్టర్‌లో చోరీ



తలుపులు పగులగొట్టిన దుండగులు

కేయూ క్యాంపస్ : కాకతీయ యూనివర్సిటీలో ఓ ప్రొఫెసర్ క్వార్టర్‌లో చోరీ జరిగిన ఘటన ఆలస్యంగా సోమవారం వెలుగు చూసింది. ఆంగ్ల విభాగంలోఅసోసియేట్ ప్రొఫెసర్‌గా విధులు నిర్వర్తించి ఉద్యోగ విరమణ పొందిన రేణుక.. ప్రొఫెసర్ క్వార్టర్ -2(పీ2)లో ఉంటున్నారు. క్వార్టర్‌కు తాళం వేసి ఇటీవల హైదరాబాద్‌కు వెళ్లారు. అక్కడే కొద్దిరోజులుగా ఉన్నారు. ఈ క్రమంలో క్వార్టర్ తలుపులు పగలగొట్టి ఉన్నాయనే సమాచారం మేరకు రేణుక తన భర్తతో కలిసి హైదరాబాద్ నుంచి యూనివర్సిటీకి వచ్చారు. వెంటనే కేయూ సెక్యూరిటీ ఆఫీసర్, కేయూ పోలీస్‌స్టేషన్‌కు సమాచారం ఇవ్వగా.. ఎస్సై వచ్చి వివరాలు సేకరించారు. బీరువాలు తెరిచి సామన్లు చిందరవందర చేశారని, ఇతర విలువైన డాక్యుమెంట్లు కనపడటంలేదని పోలీసుకు ఫిర్యాదు చేశారు.

మెడికల్ షాపులో..

- రూ.15వేల నగదు అపహరణ

రఘునాథపల్లి: మండల కేంద్రంలోని ఆక్సిజన్ మెడికల్ షాపులో సోమవారం తెల్లవారు జామున చోరీ జరిగింది. రఘునాథపల్లికి చెందిన బైరగోని నవీన్ అండర్‌పాస్ వద్ద మెడికల్ షాపు నిర్వహిస్తున్నాడు. ఆదివారం రాత్రి షాపు షెట్టర్‌కు తాళం వేసి ఇంటికి వెళ్లారు. ఉదయం షాపు తెరిచేందుకు రాగా షెట్టర్ తాళాలు పగులకొట్టి ఉన్నాయి. దీంతో చోరీ జరిగిందని గుర్తించి పోలీసులకు సమాచారం అందించాడు. ఎస్సై రఘుపతి సిబ్బందితో కలిసి షాపు వద్దకు చేరుకొని చోరీ జరిగిన తీరును పరిశీలించారు. క్యాష్ కౌంటర్‌లో ఉన్న రూ. 15వేల నగదును అపహరించినట్లు గుర్తించారు. క్లూస్‌టీమ్ క్యాష్ కౌంటర్ , తాళాలపై వేలి ముద్రలు సేకరించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. అలాగే, ఓ సెల్ షాపులో దుండగులు చోరీకి యత్నించగా షెట్టర్ లాక్ తెరుచుకోకపోవడంతో వెనుదిరిగారు.

రాజేష్ కన్నా సేవలు మరువలేనివి..

- టీపీయూఎస్ రెండు జిల్లాల బాధ్యులు

విద్యారణ్యపురి: తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం(టీపీయూఎస్) హనుమకొండ జిల్లా పూర్వ అధ్యక్షుడు కొల్లూరు రాజేష్‌కన్నా సేవలు మరలేనివని టీపీయూఎస్ రెండు జిల్లాల బాధ్యులు అన్నారు. కొంత కాలంగా అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న కొల్లూరు రాజేష్‌కన్నా సోమవారం ఉదయం హనుమకొండలోని తన నివాసంలో మృతి చెందారు. కాగా, రాజేష్ కన్నా హనుమకొండ జిల్లా అధ్యక్షుడిగా, ఆత్మకూరు, హసన్‌పర్తి మండలాల అధ్యక్షుడిగా, ఉమ్మడి వరంగల్ జిల్లా ఉపాధ్యక్షుడిగాను సేవలు అందించారు. వరంగల్ అర్బన్ జిల్లాలో ఉత్తమ ఉపాధ్యాయుడి అవార్డు అందుకున్నారు. టీపీయూఎస్ హనుమకొండ ,వరంగల్ జిల్లాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆముదాల దాత మహర్షి, బత్తిని వెంకటరమణ, బద్దిని వీరస్వామి, ఉప్పుల సతీష్,



రాజేష్‌కన్నా మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న టీపీయూఎస్ బాధ్యులు

ఉమ్మడి వరంగల్ జిల్లా ఆ సంఘం నాయకులు పిన్నింటి బాలాజీరావు, చిదురాల సుధాకర్, దాస్యం రామానుజస్వామి, మాచర్ల భిక్షపతి.. రాజేష్‌కన్నా మృతదేహానికి నివాళులర్పించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ రాజేష్‌కన్నా మృతి టీపీయూఎస్‌కు తీరని లోటన్నారు. కాగా, హనుమకొండ ఎంఈవో రాంకిషన్‌రాజు, డీఈవో కార్యాలయం కమ్యూనిటీ మొబైలిజింగ్ కోఆర్డినేటర్‌బి రాధ కూడా నివాళులర్పించారు.

కాళోజీ ఖ్యాతిని తెలిపేలా నిర్మాణం

- చీఫ్ విప్ దాస్యం వినయ్ భాస్కర్, ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్



కాళోజీ కళాక్షేత్రం నిర్మాణంపై చర్చిస్తున్న చీఫ్‌విప్ దాస్యం, ఎమ్మెల్సీ దేశపతి, 'కుడా' చైర్మన్

హన్మకొండ/వరంగల్ కల్చరల్: కాళోజీ ఖ్యాతిని తెలిపేలా కాళోజీ కళాక్షేత్రం నిర్మాణం ఉండాలని ప్రభుత్వ చీఫ్‌విప్ దాస్యం వినయ్ భాస్కర్, ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్ అన్నారు. కాళోజీ కళాక్షేత్రం నిర్మాణ పనులపై సోమవారం హైదరాబాద్ రవీంద్రభారతిలో 'కుడా' చైర్మన్ సంగం రెడ్డి సుందర్ రాజ్ యాదవ్ ఆధ్వర్యంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. తెలంగాణ రాష్ట్ర, భాషా, సాంస్కృతిక మండలి సంచాలకుడు మామిడి హరికృష్ణ, 'కుడా' సీపీఓ అజిత్ రెడ్డి, డీఈఈ రఘునందన్ రావు, కాళోజీ ఫౌండేషన్ అధ్యక్షుడు నాగిళ్ల రామశాస్త్రి, కార్యదర్శి వీఆర్ విద్యార్థి, శ్రీనివాస్‌రావు, అశోక్, నిర్మాణ బాధ్యుడు నవీన్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా దాస్యం వినయ్ భాస్కర్, దేశపతి శ్రీనివాస్ మాట్లాడుతూ కాళోజీ కళాక్షేత్ర నిర్మాణంపై సీఎం కేసీఆర్ ప్రత్యేక దృష్టి సారించారన్నారు. ఈ నేపథ్యంలో నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. కాళోజీ ప్రాముఖ్యం, విశిష్టత, చరిత్ర తెలిపేలా నిర్మాణ పనుల్లో ప్రత్యేక చొరవ చూపాలన్నారు. కాళోజీ రచనలు, పుస్తకాలు, వస్తువులు ప్రత్యేకంగా పొందుపరచాలని సూచించారు. కాళోజీ జీవిత చరిత్రపై డాక్యుమెంటరీ రూపొందించి ప్రదర్శించాలన్నారు. కాళోజీ విగ్రహం, చిత్ర మాలికలకు ప్రత్యేక స్థానాలు కేటాయించాలన్నారు. 'కుడా' చైర్మన్ సుందర్‌రాజ్ యాదవ్ మాట్లాడుతూ కళాక్షేత్ర నిర్మాణంలో అత్యున్నత ప్రమాణాలు పాటించాలన్నారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు అద్దం పట్టేలా నిర్మాణం ఉండాలన్నారు.

అప్పల బాధతో కౌలురైతు ఆత్మహత్య



గోవిందు(ఫైల్)

గీసుకొండ: వరంగల్ జిల్లా గీసుకొండ మండలం నందనాయక్‌తండాకు చెందిన కౌలు రైతు బాధావత్ గోవిందు (43) అప్పులబాధతో ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి భార్య, పోలీసుల కథనం ప్రకారం.. గోవిందు తమ గ్రామ శివారు కాంద్ర మాధవరావు రైతుకు చెందిన 2 ఎకరాల భూమిని మూడేళ్ల నుంచి కౌలుకు తీసుకుని సాగు చేస్తున్నాడు. పెట్టుబడి కోసం గ్రామంలోని పలువురి వద్ద సుమారు రూ.6 లక్షల వరకు అప్పు తీసుకున్నాడు. పంటలు సరిగా పండకపోవడం, అప్పులు తీరక జీవితంపై విరక్తి చెంది ఈనెల 22న కొమ్మాల పెట్రోల్ బంక్ సమీపంలో క్రిమిసంహారక మందు తాగిన గోవిందు.. ఇంటికి చేరాడు. కుటుంబ సభ్యులు గుర్తించి వరంగల్ ఎంజీఎం ఆస్పత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ ఆదివారం సాయంత్రం మృతి చెందాడు. సోమవారం మృతుడి భార్య సుశీల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు గీసుకొండ ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ తెలిపారు. కాగా మృతుడి కుటుంబ సభ్యులను కాంగ్రెస్ నాయకులు తుమ్మనపెల్లి శ్రీనివాస్, చాడ కొమురారెడ్డి, నాగారపు స్వామి, ఆకుల రుద్రప్రసాద్ తదితరులు పరామర్శించి ఇనగాల చారిటబుల్ ట్రస్టు ద్వారా ఆర్థిక సాయం అందజేశారు.

ధన్వాడలో మరోవ్యక్తి..



శంకరయ్య(ఫైల్)

కాటారం: బిడ్డ పెళ్లికి చేసిన అప్పులు తీర్చలేక జీవితంపై విరక్తి చెందిన వ్యక్తి.. ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన కాటారం మండలం ధన్వాడలో జరిగింది. గ్రామానికి చెందిన బోడ శంకరయ్య(50) కొంత కాలం క్రితం తన కూతురు వివాహం చేశాడు. దీంతో పాటు కొంత భూమి కౌలుకు తీసుకొని పత్తిసాగు చేయగా రూ.5లక్షల మేర అప్పు అయింది. అప్పు ఎలా తీర్చాలని తీవ్ర మనోవేదనకు గురైన శంకరయ్య సోమవారం ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. దీనిపై మృతిడి భార్య బోడ నీరజ ఫిర్యాదు మేరకు కేసు నమెదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై అభినవ్ తెలిపారు.

పెగడపల్లిలో వివాహిత..

హసన్‌పర్తి: హసన్‌పర్తి మండలం పెగడపల్లికి చెందిన ఓ వివాహిత ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. గ్రామానికి చెందిన గంద్రాతి అరుణ కుమారుడు గురువర్ధన్ రెండేళ్ల క్రితం రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. అప్పటి నుంచి అరుణ మానసిక వేదనతో బాధపడుతోంది. ఈ క్రమంలో సోమవారం ఉదయం ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. దీనిపై మృతురాలి భర్త గంద్రాతి రాజేందర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాజ్‌కుమార్ తెలిపారు.

మద్యం తాగొద్దని మందలించినందుకు..

- అన్నను చంపిన తమ్ముడు
- శంకరాజుపల్లిలో ఘటన

ఏటూరునాగారం: మద్యం తాగి ఆరోగ్యం పాడుచేసుకోవద్దని తమ్ముడిని అన్న మందలించాడు. దీనికి కోపోద్రిక్తుడైన తమ్ముడు..అన్నను రోకలితో మోదీ చంపాడు. ఈ ఘటన సోమవారం ములుగు జిల్లా ఏటూరునాగారం మండలం శంకరాజుపల్లిలో జరిగింది. గ్రామానికి చెందిన యానక ముత్తయ్య(55), యానక బాబు అన్నాదమ్ముళ్లు. ఈ క్రమంలో మద్యం సేవించి ఆరోగ్యం పాడుచేసుకోవద్దని తమ్ముడు బాబును అన్న ముత్తయ్య మందలించాడు. దీనిని మనసులో పెట్టుకున్న బాబు.. భోజనం చేసేందుకు పంపు వద్ద చేతులు శుభ్రం చేసుకుంటున్న క్రమంలో ముత్తయ్యను రోకలితో మోదాడు. దీంతో ముత్తయ్య అక్కడికక్కడే మృతి చెందాడు. దీనిపై మృతుడి కుమారుడు దయాకర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ మండల రాజు తెలిపారు. నిందితుడు పరారీలో ఉన్నారన్నారు.

కమిషనరేట్‌కు పలువురు ఇన్‌స్పెక్టర్ల బదిలీ



వరంగల్ క్రైం: రాష్ట్రంలో వివిధ ప్రాంతాల్లో పనిచేస్తున్న పలువురు ఇన్‌స్పెక్టర్లను వరంగల్ పోలీస్ కమిషనరేట్‌కు బదిలీ చూస్తు డీజీపీ ఉత్తర్వులు జారీ చేశారు. ఆదిలాబాద్ నుంచి ఎల్.ప్రవీణ్‌కుమార్, ఖమ్మం నుంచి ఎస్.రవికుమార్, సిద్దిపేట నుంచి రాజశేఖర్‌రెడ్డి, జయశంకర్ భూపాలపల్లి నుంచి పులి వెంకట్, ఆదిలాబాద్ నుంచి జి.సతీష్‌కుమార్, జూలూరుపాడు సర్కిల్ నుంచి తాటపాముల సురేష్, ఎస్.చంద్రమోహన్‌ను కమిషనరేట్‌కు బదిలీ చేస్తే ఉత్తర్వులు వెలువడ్డాయి.

విద్యుదాఘాతంతో రైతు మృతి



యాకూబ్‌రెడ్డి(ఫైల్)

జనగామ రూరల్: ఓ రైతు.. తన పొలం వద్ద ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతుకు గురికావడంతో మరో ట్రాన్స్‌ఫార్మర్ నుంచి విద్యుత్ కనెక్షన్ ఇస్తున్నాడు. ఈ క్రమంలో విద్యుదాఘాతం సంభవించి మృతి చెందాడు. ఈ ఘటన సోమవారం మండలంలోని గోపిరాజుపల్లిలో జరిగింది. గ్రామానికి చెందిన లింగాల యాకూబ్‌రెడ్డి (35)కి రెండు ఎకరాల పొలం ఉంది. ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతుకు గురికావడంతో జనగామ విద్యుత్ కార్యాలయానికి తీసుకెళ్లాడు. అక్కడ అధికారులు కొత్త ట్రాన్స్‌ఫార్మర్ మంగళవారం అందజేస్తామని తెలిపారు. దీంతో నీరులేక తన పొలం ఎండుతుండంతో సమీపంలో ఉన్న మరో ట్రాన్స్‌ఫార్మర్ నుంచి స్టార్టర్‌కు కనెక్షన్ ఇస్తుండగా ఒడ్డుపై జారిపడ్డాడు. ఈ క్రమంలో తన చేతికి కరెంట్ ప్రసరిస్తున్న తీగ తగిలి అక్కడికక్కడే మృతి చెందాడు. ఘటనా స్థలికి ఎస్సై అరుణ్ చేరుకుని పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఆస్పత్రికి తరలించారు. కాగా, మృతుడికి ఇద్దరు పిల్లలు, భార్య అక్షిత ఉన్నారు.

గుట్టపై నుంచి పడి యువకుడు..



సాయికుమార్(ఫైల్)

పాలకుర్తి: మండలంలోని విస్నూరు గ్రామ గుట్టపై నుంచి పడి ఓ యువకుడు మృతి చెందాడు. గ్రామానికి చెందిన జనగామ సాయికుమార్(26) సోమవారం మద్యం తాగాడు. అనంతరం గుట్టపైకి వెళ్లగా జారి పడ్డారు. విషయం తెలుసుకున్న కుటుంబీకులు వెంటనే ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు సాయికుమార్ అప్పటికే మృతి చెందాడని ధ్రువీకరించారు. దీనిపై మృతుడి తండ్రి రాములు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై శ్రీకాంత్ తెలిపారు.

చిట్టీలు వేసి నష్టపోయాం..

- మోసగించిన వ్యక్తికి చెందిన భూమి అప్పగించి న్యాయం చేయాలి
- పల్లారుగూడ స్వయం సహాయక సంఘాల మహిళల వినతి



ఇన్‌చార్జ్ తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న మహిళలు

సంగెం: పొదుపు సంఘం, చిట్టీల పేరుతో సుమారు 500 మందిని మోసం చేసి సుమారు రూ.1.50కోట్లతో ఉడాయించిన వ్యక్తికి సంబంధించి భూమిని తమకు అప్పగించాలని మహిళలు వేడుకుంటున్నారు. వరంగల్ నగరంలోని అబ్బనికుంటకు చెందిన వేములపల్లి సంపత్.. 'వెంకటలక్ష్మి పొదుపు సంఘం' పేరుతో సంగెం మండలం పల్లారుగూడ గ్రామానికి చెందిన సుమారు 500 మంది మహిళల వద్ద నెలనెలా పొదుపుతో పాటు చిట్టీలు నిర్వహించాడు. అనంతరం ఏడేళ్ల క్రితం సుమారు రూ 1.50లతో ఉడాయించాడు. అతడికి సంబంధించి గ్రామంలో 5 గుంటల భూమి ఉంది. ఆ భూమిని గ్రామానికి చెందిన సమ్మయ్య అక్రమంగా వినియోగించుకుంటున్నాడు. దీనిపై విచారణ చేపట్టి ఆ భూమిని పొదుపు, చిట్టీలు వేసి నష్టపోయిన తమకు అప్పగించాలని వారు వేడుకుంటున్నారు. ఈ మేరకు శనివారం ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డికి, సోమవారం ఇన్‌చార్జ్ తహసీల్దార్ రాజేశ్వర్ రావు, ఎస్సై భరత్‌కు వినతి పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో పల్లారుగూడ స్వయం సహాయక సంఘాల మహిళలు గుర్రం గీత, బి.పద్మ, సరస్వతి, విజయ, అరుణ, భాగ్యమ్మ, మణమ్మ సుభద్ర తదితర పాల్గొన్నారు.

బీఆర్ఎస్ సర్కారును బొంద పెట్టడం ఖాయం

- పేదలకు డబుల్ బెడ్రూం ఇళ్లు ఇవ్వాలి
- బీజేపీ రాష్ట్ర ఎన్నికల నిర్వహణ కమిటీ చైర్మన్ ఈటల రాజేందర్



హనుమకొండ : ధర్నాలో మాట్లాడుతున్న ఈటల, పాల్గొన్న నాయకులు

హన్మకొండ/వరంగల్: పేద ప్రజలకు సీఎం కేసీఆర్ డబుల్ బెడ్రూం ఇళ్ల ఇవ్వకపోతే బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని బొంద పెట్టడం ఖాయమని బీజేపీ రాష్ట్ర ఎన్నికల నిర్వహణ కమిటీ చైర్మన్, ఎమ్మెల్యే ఈటల రాజేందర్ అన్నారు. పేదలకు డబుల్ బెడ్రూం ఇవ్వాలని డిమాండ్ చేస్తూ సోమవారం బీజేపీ హనుమకొండ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సోమవారం హనుమకొండ కలెక్టరేట్ ఎదుట, పోచమ్మమైదాన్ జంక్షన్‌లో బీజేపీ ఆధ్వర్యంలో ధర్నా కార్యక్రమాలు చేపట్టారు. ఈ సందర్భంగా ఈటల రాజేందర్ మాట్లాడుతూ అధికారంలోకి వచ్చి తొమ్మిదేళ్లయినా అర్హులైన పేదలకు డబుల్ బెడ్రూం ఇళ్లు కట్టియ్యలేని చేతకాని ప్రభుత్వం కేసీఆర్ నాయకత్వంలో కొనసాగుతోందని ధ్వజమెత్తారు. కాంగ్రెస్ హయంలో వేల కోట్లతో కట్టిన రాజీవ్ గృహకల్ప ఇళ్లే ఇంత వరకు ఎవరికీ ఇవ్వలేదని.. దీనిని బట్టి చూస్తే పేద వాళ్లపై ఆయనకు ఎంత మమకారం ఉందో అర్థమవుతోందని అన్నారు. రాష్ట్రంలో మద్యం ఏరులై పారుతోందని, పేదలు సంపాదిస్తున్న కూలీ బార్లకే పోతోందని ఆందోళన వ్యక్తం చేశారు. గ్రామాల్లో వాడ వాడకు బెల్ట్ షాపులే రాష్ట్ర అభివృద్ధా అని నిలదీశారు. సీఎం కేసీఆర్ కల్లబొల్లి మాటలతో ప్రజలను మోసం చేస్తున్నారని విమర్శించారు. రాష్ట్రంలో బీజేపీ ప్రభుత్వం వస్తే పేదలందరికీ డబుల్ బెడ్రూం ఇళ్లు కట్టిస్తామని, ఇంట్లో ఇద్దరు దంపతులకు వృద్ధాప్య పింఛన్ ఇస్తామన్నారు. వేర్వేరుగా జరిగిన ఆయా కార్యక్రమాల్లో పార్టీ హనుమకొండ, వరంగల్ జిల్లాల అధ్యక్షులు రావు పద్మ, కొండేటి శ్రీధర్, జిల్లా ఇన్‌చార్జ్ డాక్టర్ వి.మురళీధర్ గౌడ్, మాజీ ఎమ్మెల్యేలు మార్తినేని ధర్మారావు, మోలుగురి భిక్షపతి, వన్నాల శ్రీరాములు, చాడ శ్రీనివాస్ రెడ్డి, రాకేష్ రెడ్డి, గురుమూర్తి శివకుమార్, పేసరు విజయచందర్‌రెడ్డి, ఎర్రబెల్లి ప్రదీప్‌రావు, ఎడ్ల అశోక్‌రెడ్డి, వంగాల సమ్మిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'టాస్క్‌ఫోర్స్' అదుపులో భూకబ్జాదారులు..!

వరంగల్ క్రైం: వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో కబ్జాలకు పాల్పడుతున్న కొంత మందిని టాస్క్‌ఫోర్స్ పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు సమాచారం. వరంగల్ పోలీస్ కమిషనర్‌గా ఏవీ.రంగనాథ్ బాధ్యతలు స్వీకరించిన తరువాత కబ్జాదారులపై ఉక్కుపాదాం మోపడంతో వందల సంఖ్యలో పోలీస్ స్టేషన్లకు ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. ఈ క్రమంలో భూకబ్జాలకు పాల్పడుతున్న కొంత మందిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు తెలిసింది. నకిలీ పత్రాలు సృష్టించి ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్న వారిని విచారిస్తున్నట్లు సమాచారం.